

కళయా.. మాయా..!

- కళ్లకు గంతలు కట్టుకుని కనిపెడుతున్న సాత్విక
- రామాయణం, భగవద్గీతను చెప్పేస్తున్న కార్తీక్



కళ్లకు గంతలు కట్టుకుని చదువుతున్న సాత్విక

తాడిపత్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సురేఖ, అయ్యప్ప దంపతుల కూతురు సాత్విక కళ్లకు గంతలు కట్టుకుని అన్నింటినీ కనిపెట్టేస్తోంది. అంకెలు, అక్షరాలు, రంగులు, బొమ్మలు.. ఇలా ఏవి పెట్టినా ఇట్టే చెప్పేస్తోంది. బొమ్మలు గీసి, పెయింటింగ్ వేస్తోంది. సాత్విక తమ్ముడు ప్రీతమ్ కార్తీక్ భగవద్గీత, రామాయణాన్ని నోటికి చెప్పేస్తున్నాడు. సురేఖ టీటీడీ పరిపాలనా విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయ్యప్ప సివిల్ కాంట్రాక్టర్. వీరు తిరుపతిలో ఉంటున్నారు. దసరా సెలవులకు తాడిపత్రికి వచ్చారు. చిన్నారి సాత్విక ప్రతిభ గురించి తెలుసుకున్న బంధుమిత్రులు, ప్రత్యక్షంగా తిలకించేందుకు ఆసక్తిగా వచ్చారు. అందరి ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని సాత్విక తన ప్రతిభను ప్రదర్శించి అబ్బురపరిచింది. సాత్వికలో ఈ ప్రతిభను చిన్నతనంలోనే గుర్తించిన తల్లిదండ్రులు బాగా ప్రోత్సహించారు. 'గాంధారి విద్య'గా పేర్కొనే ఈ కళకు కర్ణాటకలోని కూడ్లిగిలో శిక్షణ ఇప్పించారు. శిక్షణలో స్మెల్ ప్రాసెస్, టచ్ ప్రాసెస్, స్కానింగ్ ప్రాసెస్ ఉంటాయని, ఈ మూడింటిని కేవలం పది రోజుల్లోనే తన కూతురు నేర్చుకుందని అన్నారు. సాత్విక వయసు కేవలం 11 ఏళ్లు. తిరుపతిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. ప్రీతమ్ కార్తీక్ వయసు ఏడేళ్లు. భగవద్గీత, రామాయణం కంఠతా వచ్చు. తడుముకోకుండా చెప్పేస్తాడు.



తల్లిదండ్రులతో సాత్విక, ప్రీతమ్ కార్తీక్

హంద్రీనీవా పెండింగ్ పనులకు ఆమోదం

7

36 మంది వెళ్లారు.. 22 మంది వచ్చారు

- జిల్లాకు చేరిన టీచర్ల అంతర్ జిల్లా బదిలీల జాబితా

7

ఉమ్మడి జిల్లాకు స్వచ్ఛ అవార్డులు

- 6న సీఎం చేతులమీదుగా పురస్కారాలు

ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు, పంచాయతీలకు స్వచ్ఛ అవార్డులు వచ్చాయి. తాడిపత్రి మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. జిల్లాస్థాయిలో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 54 అవార్డులను ప్రకటించించారన్నారు. జిల్లాస్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఈనెల 6వ తేదీన నిర్వహిస్తామన్నారు.

7



కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు శయనోత్సవం ←

పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాతకు శయనోత్సవం →



జయ జయహే దుర్గా..!

- ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి
- ఘనంగా విజయ దశమి వేడుకలు

దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో భక్తులను అనుగ్రహించిన దుర్గామాత విజయ దశమి రోజున ప్రత్యేక పూజలను అందుకున్నారు. ఆలయాలలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతపురం నగరంలోని కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీమాత బంగారపు చీర ధరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తులను మహావారాహి మాత, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, ఇంద్రాణిదేవి, మహేశ్వరిదేవిగా అలంకరించారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని బంగారపు చీరతో అలంకరించారు. ఉత్సవమూర్తి నవదుర్గగా భక్తులను అనుగ్రహించారు. పాతూరు, కొత్తూరు అమ్మవారిశాలల్లో వేడుకలను శుక్రవారం సాయంత్రం శయనోత్సవంతో ముగించారు. చివరి రోజు వేడుకలకు భక్తులు విశేషంగా తరలివచ్చారు.



పాతూరు అమ్మవారిశాలలో కోలాటమాడుతున్న భక్తులు



- తాడిపత్రి చింతల వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. స్వామివారి ఉత్సవ మూర్తికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారు సాయంత్రం చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

- కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం సీతారామ చంద్ర సహిత ఆంజనేయస్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, రథంలో కొలువుదీర్చి పూజల నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య గ్రామోత్సవం, శమీ వృక్ష దర్శనం, ఆరాధన, జమ్మిచెట్టుకు గ్రామోత్సవం నిర్వహించారు. వేడుకలలో ఈఓ మేడేపల్లి విజయరాజు, అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్, తాడిపత్రి, గుంతకల్లు టౌన్



కసాపురం: గ్రామోత్సవంలో పాల్గొన్న ఆలయ సిబ్బంది, అర్చకులు

నేడు ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు

లబ్దిదారుల ఖాతాల్లోకి జమ చేయనున్న ప్రభుత్వం

రవాణాశాఖ ఉప కమిషనర్ వీర్రాజు

అనంతపురం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్స్ క్యాబ్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వాహన యజమానులకు కూటమి ప్రభుత్వం శనివారం రూ.15వేలు ఆర్థిక సాయం చేయనుంది. ఆటో డ్రైవర్ సేవలో పథకానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభిస్తున్నారని జిల్లా ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ప్రకటనలో వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1,137 మంది, గుంతకల్లు 1,655, కళ్యాణదుర్గం 323, రాప్తాడు 1,752, రాయదుర్గం 343, శింగనమల 1,643, తాడిపత్రి 1,614, ఉరవకొండలో 808 మంది కలిపి జిల్లా వ్యాప్తంగా మొత్తం 9,275 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.13.91 కోట్లు జమ చేస్తారన్నారు.

విదేశాలకు చీనీ ఎగుమతి చేయాలి

- కలెక్టర్ ఆనంద్

అనంతపురంరూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు, వ్యాపారులతో చర్చించి వచ్చే సీజన్‌లో కనీసం రెండు వందల టన్నుల చీనీకాయలను విదేశాలకు ఎగుమతి చేయాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈనామ్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. మార్కెట్‌కు దిగుబడుల రాకపై ఆరాతీశారు. వ్యాపారులు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పాత గోదాములను కవర్ షెడ్లుగా మార్చాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్, డీఈ రఘునాథ్, గ్రేడ్-2 కార్యదర్శి రూపకుమార్, సూపర్‌వైజర్ కిశోర్ పాల్గొన్నారు.



రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

అనంతపురం కలెక్టరేట్(ఆంధ్రజ్యోతి): మహనీయుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో వారి చిత్రపటాలకు కలెక్టర్ పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... గాంధీ, బహదూర్ శాస్త్రి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పండుగపూట విషాదం

- ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు
- ఓ ఘటనలో తండ్రీకొడుకులు, మరో చోట వృద్ధుడి మృతి
- పలువురికి స్వల్ప గాయాలు (వివరాలు 7లో..)

పండిట్లకు పండగ

- విజయ దశమి రోజే ఉద్యోగోన్నతులు
- స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం
- 114 మందికి రాత్రికి రాత్రే ఆర్డర్లు
- సర్వత్రా హర్షాతిరేకాలు



ఎల్‌పీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉత్తర్వులు అందజేస్తున్న విద్యాశాఖాధికారులు

6

అత్యాధునిక అంబులెన్స్‌లు



అత్యాధునిక 108 వాహనం

అనంతపురం వైద్యం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సౌకర్యాలు కలిగిన 108 వాహనాలు జిల్లాకు వచ్చేశాయి. అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ (ఏఎల్ఎస్)తో కూడిన మూడు అంబులెన్స్‌లను జిల్లాకు ప్రభుత్వం కేటాయించింది. అవి జిల్లాకు చేరుకున్నాయి. వీటిని అత్యవసర సేవల కోసం వినియోగించనున్నారు. జిల్లాలో 108 వాహనాలు 32 వినియోగంలో ఉన్నాయి. వాటి నిర్వహణ, పర్యవేక్షణ గత వైసీపీ ప్రభుత్వంలో అరవిందో సంస్థకు అప్పగించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక భవ్య ఏజెన్సీకి అప్పగించారు. గత వాహనం కంటే మెరుగైన సదుపాయాలు, సేవలను అందించే లక్ష్యంగా ఏఎల్ఎస్ వాహనాలను తీసుకొచ్చారు. ఇందులో గత వైసీపీ హయాంలోలాగా ప్రభుత్వ భజన లేదు. అధికార పార్టీ గుర్తులు, రంగులు కనిపించవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజముద్రలను మాత్రమే వాహనాలపై ముంద్రించడం విశేషం. ఈ వాహనాల్లో వెంటిలేటర్, ఈసీజీ, ఇన్‌ఫ్యూజన్ పంప్, బ్రెయిన్ సర్క్యూట్ తదితర అత్యాధునిక సౌకర్యాలున్నాయి. ప్రస్తుతం మూడు కొత్త వాహనాలు వచ్చాయి. త్వరలో అన్నీ కొత్తవే వస్తాయని అధికార వర్గాలు తెలిపాయి.

ఎంపీపీపై వైసీపీ అవిశ్వాసం!



ఆర్డీఓకి వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ ఎంపీటీసీలు

బెళుగుప్ప, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ పెద్దన్నపై వైసీపీ ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రవేశ పెట్టనున్నారు. అందులో భాగంగా శుక్రవారం ఆర్డీవో వసంత్ బాబుకు మనవిపత్రం ఇచ్చారు. దీంతో మండలంలో రాజకీయ చర్చ మొదలైంది. పెద్దన్న వైసీపీ తరఫున ఎంపీటీసీగా గెలిచి, ఎంపీపీ పదవి చేపట్టారు. కూటమి అధికారం చేపట్టాక టీడీపీలో చేరారు. ఈ నేపథ్యంలో ఆయనపై వైసీపీ సభ్యులు అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని కోరుతున్నారు. మండలంలో మొత్తం 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ఐదుగురు అనుకూలంగా ఓటు వేస్తే టీడీపీ ఎంపీపీగా పెద్దన్న గెలిచే అవకాశాలున్నాయి. ప్రస్తుతం నలుగురు.. పెద్దన్న వైపు మొగ్గు చూపుతున్నారు. మరికొందరు కూడా ఆసక్తిగా ఉన్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అవిశ్వాస తీర్మానంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వైసీపీ నాయకులు పరువు కోసం పాకులాడుతున్నారనీ, తామే నెగ్గుతామని టీడీపీ వర్గీయులు ధీమాగా ఉన్నారు.



ఎంపీపీ పెద్దన్న

ఉడకని పప్పులు..!

- విత్తన పప్పుశనగ సరఫరాపై నీలినీడలు
- గత నెలలోనే సబ్సిడీ ధరలు ఖరారు
- బకాయిల చెల్లింపు కోసం సరఫరాదారుల పట్టు
- ఫలించని అధికారుల సంప్రదింపులు
- అదును దాటుతుందేమోనని రైతుల ఆందోళన

అనంతపురం అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ ఆరంభమయినా సబ్సిడీ విత్తన పప్పుశనగ సరఫరాపై సందిగ్ధం వీడలేదు. గత నెలాఖరులో పప్పుశనగ సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. దీంతో ఇక తమకు పప్పుశనగ విత్తనాలు పంపిణీ చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్న రైతులకు చుక్కెదురైంది. పెండింగ్ బకాయిలు చెల్లిస్తేనే ఈ సారి పప్పుశనగ సరఫరా మొదలు పెడతామని సరఫరాదారులు మొండికేసినట్లు సమాచారం. పలు మార్లు సంబంధిత అధికారులు సంప్రదించినా బకాయిలు చెల్లిస్తేనే పప్పుశనగ సరఫరా చేస్తామని సరఫరాదారులు మొండికేసినట్లు తెలిసింది. దీంతో ఏం చేయాలో తోచని అయోమయంలో అధికార యంత్రాంగం కొట్టుమిట్టాడుతోంది. వరుసగా పడిన వర్షాలకు ప్రస్తుతం నల్లరేగడి భూముల్లో తేమ ఎక్కువగా ఉంది. పొలాల్లో తేమ ఆరగానే పప్పుశనగ విత్తనం వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో మరో మూడు రోజుల్లో విత్తనం వేసేందుకు చాలా మంది రైతులు సిద్ధమయ్యారు. చిన్న, సన్నకారు రైతులు సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. అదునుకు విత్తనం అందదేమోనని ఒకింత ఆందోళనలో వారు ఉన్నారు. ఐదెకరాలకుపైగా పొలం కలిగిన రైతులు బహిరంగ మార్కెట్‌లో విత్తన పప్పుశనగ ఇప్పటికే కొనుగోలు చేసుకొని విత్తుకు సిద్ధమయ్యారు.

వేల హెక్టార్లలో సాగు..

ప్రతి ఏడాది రబీ సీజన్‌లో జిల్లాలో 55వేల హెక్టార్లకుపైగానే పప్పుశనగ పంట సాగవుతోంది. సెప్టెంబరు 29న ప్రభుత్వం సబ్సిడీ ధరలు ఖరారు చేసింది. పప్పుశనగ జేజీ -11 రకం క్వింటా పూర్తి ధర రూ.7800లుగా నిర్ణయించారు. ఇందులో 25 శాతం సబ్సిడీపోను రైతు వాటా కింద క్వింటా ధర రూ.5850లు చెల్లించాల్సి ఉంది. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా గరిష్ఠంగా 10 బస్తాల (బస్తా 20 కేజీలు) పప్పుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు. గత ఏడాది అక్టోబరు 1 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మొదలు పెట్టారు. రెండో వారం నుంచి విత్తన పంపిణీని ఆరంభించారు. ఈ సారి అందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రభుత్వ పెద్దలు స్పందిస్తేనే..

రాష్ట్ర స్థాయిలో గత నెలలోనే పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. సబ్సిడీ ధరలు కూడా ఖరారు చేశారు. ఉమ్మడి అనంత జిల్లాలో ఈ సారి నలుగురు పప్పుశనగ సరఫరా కోసం టెండర్లు దక్కించుకున్నారు. గత ఏడాది రబీ సీజన్‌లో 14 మంది సరఫరాదారులు పప్పుశనగను సరఫరా చేశారు. గత ఏడాదికి పప్పుశనగ సరఫరాకు సంబంధించి రూ.40 కోట్లను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. టెండర్లు నిర్వహించిన రోజునే సరఫరాదారులు బకాయిలు పూర్తిగా చెల్లిస్తేనే విత్తనాలు సరఫరా చేస్తామని ఖరాకండిగా చెప్పారు. అందుకు కమిషనరేట్ ఉన్నతాధికారులు అంగీకరించినా.. ఇప్పటి దాకా పాత బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లించకపోవడంతో పప్పుశనగ సరఫరా మొదలు కాలేదు. దీనిపై ప్రభుత్వం పెద్దలు స్పందిస్తేనే సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. లేదంటే పప్పుశనగ సరఫరా మరింత అలస్యమయ్యే అవకాశం ఉంది. ఇదే కొనసాగితే చిన్న, సన్నకారు రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

» మావోయిస్టుల ఘాతుకం..

» బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

» కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

సత్యసాయి ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

» గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

» రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం

» స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్ల తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనంద న్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

» గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

» అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం

» ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

పండిట్లకు పండగ

● విజయ దశమి రోజే ఉద్యోగోన్నతులు ● స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం
● 114 మందికి రాత్రికి రాత్రే ఆర్డర్లు ● సర్వత్రా హర్షాతిరేకాలు



ప్రమోషన్లు తీసుకోవడం కోసం గురువారం రాత్రి డీఈఓ ఆఫీస్‌వద్దకు చేరుకున్న లాంగ్వేజ్ పండిట్లు

అనంతపురం విద్య, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల(ఎల్‌పీ)కు దసరా పండుగ రోజే విద్యాశాఖ అమితానందాన్ని పంచింది. పిలిచి మరీ.. స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోతోన్నతులు కల్పించింది. పండుగ రోజు సెలవు దినమైనా గురువారం అర్ధరాత్రి వరకు వారికి జిల్లా విద్యాశాఖాధికారులు ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేశారు. దీంతో ప్రమోషన్ పొందిన వారి ఆనందానికి అవధుల్లేవు. ఇది తమకు నిజమైన విజయ దశమి అంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

పట్టించుకోని వైసీపీ పాలకులు

గత వైసీపీ హయాంలో ఎల్‌పీ అనే పదం ఉండకూడదని చెప్పి, ఎస్‌ఏలుగా అప్‌గ్రేడ్ చేసి హైస్కూళ్లకు పంపారు. ఉద్యోగోన్నతుల సమయంలో ఎస్జీటీలు సీనియారిటీ, మరోవైపు ఎల్‌పీల తెలుగు డిగ్రీ కోర్సుల విషయంలో వివాదం తలెత్తింది. అప్పటి పాలక పెద్దలు ఎస్జీటీలవైపే మొగ్గుచూపడంతో లాంగ్వేజ్ పండిట్లకు ఉద్యోగోన్నతులు దక్కలేదు. ఎల్‌పీలుగానే రెగ్యులర్ ప్లేస్‌లేక డీఈఓ పూల్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. ఎక్కడ అవసరం పడితే అక్కడికి పంపుతూ వచ్చారు. దీనిపై లాంగ్వేజ్ పండిట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. స్కూల్‌అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ (ఉద్యోగోన్నతి) కల్పించాలని వైసీపీ పాలకులపై ఒత్తిడి తెచ్చారు. అయినా గత సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు. చివరకు హైకోర్టు తీర్పు ఇచ్చినా.. ఖాతరు చేయలేదు. ఎల్‌పీలు సుప్రీంకోర్టుకు వెళ్లగా.. అక్కడ సానుకూలమైన తీర్పు వచ్చింది. దీంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి దృష్టికి కోర్టుతీర్పును తీసుకెళ్లారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి, న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి.. ఎల్‌పీల డిమాండ్ న్యాయమైనదేనని, వెంటనే వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు రాష్ట్ర విద్యాశాఖ గురువారం విజయ దశమి పండుగ సెలవు దినమైనా రాత్రికల్లా ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎల్‌పీల ఉద్యోగోన్నతులకు లైన్ క్లియరైంది.

114 మందికి ప్రమోషన్

రాష్ట్ర శాఖ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, జగదీష్, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ వెంటనే ప్రక్రియ మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెలుగులో 90 మంది, హిందీలో 14 మంది, కన్నడలో ఒకరు, ఉర్దూలో 9 మంది ఇలా మొత్తం 114మంది ఎల్‌పీలు ఉన్నట్లు గుర్తించి, వారికి సమాచారం ఇచ్చారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రిలోగా వారందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా (అప్‌గ్రేడ్) చేస్తూ ఆర్డర్లు అందజేసారు. దీంతో లాంగ్వేజ్ పండిట్లు ఆనందం వ్యక్తం చేశారు.



ప్రభుత్వానికి కృతజ్ఞతలు: అనుపమ, హిందూపురం

6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు బోధిస్తున్నా. ఉద్యోగోన్నతులు అడిగితే డిగ్రీ కోర్సు వివాదం రేపి, అన్యాయం చేశారు. న్యాయస్థానంలో అనుకూలంగా తీర్పు రావడం,కూటమి సర్కారు సానుకూలంగా స్పందించడంతో న్యాయం జరిగింది. తెలుగు టీచర్‌గా గుర్తించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

పిలిచి మరీ.. ప్రమోషన్ ఇవ్వడం ఆనందదాయకం



లాంగ్వేజ్ పండిట్లమని మమ్ములను హేళనగా చూశారు. డీఈఓ పూల్‌లో పెట్టుకుని, ఎక్కడకు పడితే అక్కడకు బదిలీ చేసి పంపుతూ ఇబ్బందులు పెట్టారు. మా ఆరేళ్ల పోరాటం ఫలించింది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని, అది కూడా విజయదశమిపండుగ రోజు పిలిచి మరీ.. ఉద్యోగోన్నతులు ఇవ్వడం ఆనందదాయకం. - రమేష్‌కుమార్, రాయదుర్గం



సర్వం.. క్వాంటం..!



భవిష్యత్తంతా క్వాంటం టెక్నాలజీదే

ఎన్నో సమస్యలు, వ్యాధులకు పరిష్కారం

పట్టుసాధిస్తే అపారమైన ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు



(ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్)

మొన్న గూగుల్, నిన్న ఏఐ, నేడు క్వాంటం ఇలా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. రోజుల సమయం పట్టే సమస్యలకు చిటికెలో పరిష్కారాలు చూపుతోంది. ఈ సంకేతికత విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ప్రస్తుతం మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఎక్కడికెళ్లినా, ఏ సభలోనైనా సరే క్వాంటం టెక్నాలజీ గురించే మాట్లాడుతున్నారు. రాష్ట్ర రాజధానిలో క్వాంటం వ్యాలీ స్థాపించి, అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతున్నారు. భవిష్యత్తంతా కూడా క్వాంటం టెక్నాలజీదే అని సాంకేతిక మేధావులు, పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈనేపథ్యంలో క్వాంటం వ్యాలీ అంటే ఏంటి..? దీని వలన కలిగే ఉపయోగాలు, ఉపాధి అవకాశాలు తదితర వాటి గురించి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం వైస్ చాన్సలర్ సుదర్శన్ రావు మాటల్లోనే తెలుసుకుందాం..

క్వాంటం కంప్యూటింగ్ అంటే..

క్వాంటం కంప్యూటింగ్ అనేది క్వాంటం ఫిజిక్స్ విచిత్ర నియమాలను ఉపయోగించి గణనలను నిర్వహించే ఒక సరికొత్త, శక్తివంతమైన సాంకేతికత. ప్రస్తుతం ఉన్న సాధారణ కంప్యూటర్లు ఉపయోగించే బిట్స్‌కు బదులుగా క్వాంటం కంప్యూటర్లు క్యూబిట్స్‌ను ఉపయోగిస్తాయి. ప్రస్తుతం ఉన్న సాధారణ కంప్యూటర్లు సమాచారాన్ని 0 లేదా 1బైనరీ బిట్స్ ఏదో ఒక్కదాన్ని మాత్రమే ప్రాసెస్ చేయగలుగుతున్నాయి. కాని క్వాంటమ్ కంప్యూటర్‌లోని క్యూబిట్స్ ఒకే సారి 0,1 లేదా రెండు కలసి పని చేస్తాయి. దీనినే సూపర్‌పొజిషన్ అంటారు. దీని కారణంగా క్వాంటమ్ కంప్యూటర్ ఒకేసారి అనేక గణన(లెక్కలు)లను చేయగలుగుతుంది. సాధారణ కంప్యూటర్ల కంటే ఎక్కువ రెట్లు వేగంతో పనిచేయడం జరుగుతుంది. క్యూబిట్ల సంఖ్య పెరిగే కొద్దీ కంప్యూటింగ్ శక్తి చాలా వేగంగా పెరుగుతుంది.

కంప్యూటింగ్ ఉపయోగాలు

క్వాంటమ్ కంప్యూటర్లు అత్యంత సంక్లిష్టమైన సమస్యలను సైతం ప్రస్తుతం ఉన్న సూపర్ కంప్యూటర్ల కంటే కూడా వేగంగా పరిష్కరించగలవు. ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, అన్ని రంగాల్లో క్వాంటం అప్లికేషన్లు ఉన్నాయి. ఫార్మసీలో కొత్త మందులు ఆవిష్కరణకు దోహదపడతాయి. ప్రస్తుతం కొత్త వ్యాక్సిన్ కనుగొనేందుకు ఏళ్ల సమయం పడుతోంది. అయితే క్వాంటం కంప్యూటింగ్ సాయంతో అతి తక్కువ కొత్త మందులు ఆవిష్కరించే అవకాశం ఉంటుంది. మెటీరియల్ సైన్స్, ఆర్థిక నమూనాలు, లాజిస్టిక్స్, రక్షణ పరిశోధనల్లో సైతం ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. క్వాంటమ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి బ్యాంకులు, ఇతరత్ర సంస్థల ఆర్థిక లావాదేవీల్లో జరిగే మోసాలను నివారించే వీలుంటుంది. వాతావరణంలో కలిగే మార్పులను చాల ముందుగా గుర్తించే వీలుంటుంది. దీనివలన వర్షాభావ పరిస్థితులు, తుపానుల హెచ్చరికలు ముందస్తుగా తెలుసుకోవడానికి వీలుంటుంది. అంతేకాకుండా సెన్సార్స్, సీటీస్కానింగ్, ఇమేజ్, వ్యాధి నిర్ధారణ సులభంగా చేసుకునే వీలుంటుంది. ప్రస్తుతం వాడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత సమర్థవంతంగా వాడుకునే అవకాశాలను క్వాంటం టెక్నాలజీ అందిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు..

క్వాంటం టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో చాలా ఉద్యోగ అవకాశాలు ఉండబోతున్నాయి. క్వాంటం సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు, హార్డ్‌వేర్ ఇంజనీర్లు, క్వాంటం అల్గోరిథమ్ డెవలపర్లు, క్వాంటం మెషిన్ లర్నింగ్, క్వాంటం సిస్టమ్స్ ఆర్కిటెక్ట్‌లు, క్వాంటం అనలిస్టులు, కన్సల్టెంట్లు ఇలా పలు రకాలైన ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటికి థియరీ కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా అవసరం. ఇంటర్న్‌షిప్స్, రిసెర్చ్ అవకాశాలు, ప్రాజెక్టుల్లో పనిచేయడం ద్వారా ఇది సాధ్యం అవుతుంది. ఇందులో కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.



కోర్సులు..అర్హతలు..

ప్లస్ టూ పూర్తిచేసి ఎంసెట్‌లో మెరిట్ సాధించిన వారు క్వాంటం టెక్నాలజీ కోర్సులు చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేషన్ ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, సంబంధిత విభాగాల్లో చదవాలి. ప్రోగ్రామింగ్ స్కిల్స్ అవర్చుకోవాలి. ఇప్పటికే ఆంధ్ర యూనివర్సిటీలో క్వాంటం కోర్సు ప్రారంభించారు. జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల్లో కూడా క్వాంటం కంప్యూటింగ్ కోర్సులను ప్రారంభించాం. బీటెక్ విద్యార్థులకు మైనర్ డిగ్రీకి అవకాశం ఇచ్చాం.

301 చెరువులకు నీరివ్వాలి

● ప్రణాళిక రూపొందించండి
● కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 301 చెరువులకు నీరందించేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 301 చెరువులను నీటితో నింపేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలువలు, ఆయకట్టు వివరాలను మ్యాప్ ద్వారా కలెక్టర్ ఆరాతీశారు.

అమృత్ పనులు వేగంగా చేపట్టాలి

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో అమృత్ పథకం పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అమృత్ పథకం పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అమృత్ 1.0 కింద రూ.15.35 కోట్లతో చేపట్టిన అనంతపురం వాటర్ సప్లై, ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్ పనులు పూర్తికాగా.. రానున్న 30 రోజుల్లో ట్రయల్ రన్ పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈని ఆదేశించారు. అమృత్ 1.0 కింద రూ.10.98 కోట్లతో చేపట్టిన వాటర్ సప్లై, ఇంప్రూవ్‌మెంట్ స్కీం పనులు 98 శాతం పూర్తయ్యాయనీ, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేసి అక్టోబరు ఆఖరుకు ట్రయల్ రన్ పనులు మొదలు పెట్టాలన్నారు. 12,096 టిడ్కో ఇళ్లను గ్రౌండింగ్ చేశారనీ, అందులో 9,744 నిర్మాణం పూర్తయ్యాయన్నారు. వాటిలో సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

● బాలుడి మృతి.. మహిళకు గాయాలు


ఇంట్లోకి దూసుకుపోయిన కారు


నిఖిల్ (ఫైల్)

ముదిగుబ్బ, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు గ్రామంలో గురువారం ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో అక్కడే ఆడుకుంటున్న నిఖిల్ (4) మృతిచెందగా, బాలుడి అత్త ఆదెమ్మ తీవ్రంగా గాయపడింది. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొరిగల్లు గ్రామానికి చెందిన రాజశేఖర్, సృజన దంపతుల కుమారుడు నిఖిల్. రాజశేఖర్ సోదరి ఆదెమ్మకు అదే ఊరికి చెందిన వ్యక్తితో వివాహమైంది. పండుగకు ఆమె పుట్టింటికొచ్చింది. గురువారం ఇంటి వరండాలో ఆదెమ్మ, నిఖిల్ ఉన్నారు. అదే సమయంలో దొరిగల్లుకే చెందిన బాలాజీ తన కారుకు గుడి వద్ద పూజ చేయించుకుని వస్తూ.. అదుపుతప్పి రాజశేఖర్ ఇంట్లోకి దూసుకెళ్లాడు. నిఖిల్, ఆదెమ్మను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వారిరువురిని.. కటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిఖిల్ మృతి చెందాడు. ఆదెమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పాఠశాలకు వెళ్తుండగా బాలిక కిడ్నాప్

● కసాపురంలో వివాహం
● పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

యాడికి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్తున్న బాలికను కిడ్నాప్ చేసి, పెళ్లి చేసుకున్నాడు ఓ యువకుడు. యాడికిలో శుక్రవారం ఈ ఘటన కలకలం రేపింది. బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక యాడికిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దసరా సెలవుల అనంతరం శుక్రవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బాలిక బస్సులో పాఠశాలకు బయల్దేరింది. పాఠశాల వద్ద దిగగానే కృష్ణారెడ్డి అనే వ్యక్తి కిడ్నాప్ చేసి, తీసుకెళ్లాడు. కసాపురం తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు.. పోలీసులను ఆశ్రయించారు. బాలికను కిడ్నాప్‌చేసి వివాహం చేసుకున్న కృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): శింగనమలకు చెందిన పదో తరగతి విద్యార్థి దసరా పండుగ రోజు కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు శింగనమలకు చెందిన ఓ మహిళా ఉద్యోగి అనంతపురంలోని ఖాజానగర్ ఉంటూ విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త , కుమారుడు శింగనమలలో ఉంటున్నారు. సెలవులు కావడంతో బాలుడు అనంతపురంలో ఉండే తల్లి వద్దకు వచ్చాడు. అయితే సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో పండుగ రోజు గురువారం సాయంత్రం 7.30 గంటలకు గుడికి వెళ్తానని చెప్పి ఇంట్లోంచి బాలుడు బయటకు వెళ్లాడు. తర్వాత తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్నిచోట్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తప్పైంది స్వామీ..!

● చోరీ సామగ్రి ఆలయానికి చేరిక


ఆలయం వద్ద ఉంచిన బియ్యం ప్యాకెట్లు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చేసిన పని తప్పనుకున్నారో లేక భయపడ్డారో తెలియదు కాని చోరీ చేసిన సామగ్రిని తిరిగి తెచ్చి అయ్యప్ప దేవాలయం వద్ద పెట్టేశారు. ఈ సంఘటన మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయం వద్ద గురువారం వెలుగుచూసింది. గత నెల 24న గుర్తు తెలియని వ్యక్తులు గర్భాలయంలో ఉన్న రెండు బియ్యం ప్యాకెట్లు, ఇతర సామగ్రిని అపహరించిన విషయం విదితమే. అయితే చోరీ చేసిన బియ్యం ప్యాకెట్లు, సామగ్రిని తిరిగి గురువారం ఆలయ ప్రాంగణంలో ఆయ్యప్పరథం వద్ద పెట్టి వెళ్లారని ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు.

ఐఆర్‌సీఎస్ సమావేశం వాయిదా

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కమిటీ సభ్యుల ఎన్నికల కోసం శనివారం పుట్టపర్తిలో నిర్వహించాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు డీసీఓ కృష్ణానాయక్ శుక్రవారం తెలిపారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వందే భారత్ రైలు రోజులో మార్పు

గుంతకల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం, ధర్మవరం మీదుగా వెళ్లే కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ (20703/04) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు రోజులను మార్పు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం శుక్రవారాలు మినహా మిగతా అన్ని రోజుల్లో నడుస్తోంది. డిసెంబరు 4 నుంచి వారంలో బుధవారం మినహా ఇతర రోజుల్లో ప్రయాణించేలా సర్వీసును మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోండి

● రిటైర్డ్ ఉద్యోగులకు డీఆర్‌ఎం సూచన


రిటైర్డ్ ఉద్యోగికి సెటిల్మెంటు పత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం

గుంతకల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులు సరైన అర్థిక ప్రణాళికను రూపొందించుకుని సెటిల్మెంటు ధనాన్ని సురక్షితమైన పెట్టుబడిగా మార్చుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో రిటైరైన ఉద్యోగులకు రైల్వే పర్సనల్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో సెటిల్మెంటు శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్ఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో పనిచేసిన రైల్వే ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత అంతే నిబద్ధతతో విశ్రాంత జీవితాన్ని ప్లాన్ చేసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంతోద్యోగులకు సెటిల్మెంటు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ అధికారులు రైల్వే రిటైర్డు ఉద్యోగులకు పొదుపు నిర్వహణ, పెట్టుబడి ఎంపికలపై సూచనలిచ్చారు. పర్సనల్ శాఖాధికారులు, రైల్వే విశ్రాంతోద్యోగులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు స్వచ్ఛ అవార్డులు

● 6న సీఎం చేతులమీదుగా పురస్కారాలు


అవార్డుకు ఎంపికైన కియ పరిశ్రమ

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అమలులో 2025 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు అవార్డులు లభించాయి. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించింది. ఈనెల 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా విజయవాడలో స్వచ్ఛాంధ్ర అవార్డులు అందుకోనున్నారు. మొత్తం 21కేటగిరిల్లో అవార్డులు ప్రకటిస్తూ శుక్రవారం జాబితా విడుదల చేశారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా కదిరి మండలం బూరుగుపల్లి గ్రామపంచాయతీకి చెందిన దొడ్డెప్ప ఎంపికైనట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. గ్రామ పంచాయతీ విభాగంలో అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ పంచాయతీ ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి బీ శ్రీనివాసులు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శంగా నిర్వహిస్తూ, ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తూ గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడంతో అవార్డు దక్కినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛ ఇండస్ట్రీస్ విభాగంలో కియ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంపికయ్యాయి. పర్యావరణాన్ని మెరుగుపరచడం, వ్యర్థ నిర్వహణలో నూతన టెక్నాలజీని ఆవిష్కరించ దం, పరిశ్రమల పరిసరాల్లో స్థానిక సమాజంతో కలిసి పనిచేసి పర్యావరణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిసింది.


గ్రీన్ అంబాసిడర్ దొడ్డప్ప


పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు


బొందలవాడలో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రం

36 మంది వెళ్లారు.. 22 మంది వచ్చారు

● జిల్లాకు చేరిన టీచర్ల అంతర్ జిల్లా బదిలీల జాబితా


ఇతర జిల్లాల నుంచి వచ్చిన టీచర్లకు ప్లేస్‌మెంట్స్ ఇస్తున్న డీఈఓ, ఏడీ

అనంతపురం విద్య, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): టీచర్ల అంతర్ జిల్లా బదిలీల జాబితాలు వచ్చేశాయి. ప్రభుత్వం నెలరోజుల క్రితం బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో స్పౌజ్, మ్యూచువల్ బదిలీల కింద జిల్లా నుంచి వివిధ కేడర్ల సబ్జెక్టులకు చెందిన 52 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు రావడానికి 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో పరిశీలించిన అనంతరం నిబంధనలు, ఖాళీల ఆధారంగా జాబితాలకు ఆమోదం తెలిపారు. అందులో అనంత నుంచి ఇతర జిల్లాలకు 36 మందిని బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి అక్కడికి 22మంది టీచర్లను కేటాయిస్తూ జాబితాలను శుక్రవారం రాష్ట్రశాఖ పంపింది. జిల్లా నుంచి వెళ్లేవారిని జాబితా మేరకు డీఈఓ ప్రసాద్ బాబు రిలీవ్ చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఇద్దరు చొప్పున గ్రేడ్-2 హెచ్‌ఎంలు, పీఎస్‌హెచ్‌ఎంలు, ముగ్గురు చొప్పున గణితం, ఫిజికల్ సైన్స్, ఒకరు చొప్పున సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లు, 8 మంది ఎస్జీటీలు శుక్రవారమే డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరందరికీ రాత్రికిరాత్రే కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనల మేరకు ఆయా యాజమాన్యాల పరిధిలోని ప్లేస్‌లను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీలు మునీర్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఆదినారాయణ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలో ప్లేస్‌లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొంతమంది రాలేకపోయిన వారికి శనివారం ఉత్తర్వులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

తక్కువ పెట్రోల్ వేశారని గొడవ

● రూ.100కు రూ.50లదే వేశాలంటూ వాగ్వాదం
● విచారణ చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు


బాటిల్‌లోకి వచ్చిన పెట్రోల్

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): వంద రూపాయలకు పెట్రోల్ వేయమంటే రూ.50 పెట్రోల్ వేశారంటూ ఇద్దరు యువకులు, పెట్రోల్ బంకు సిబ్బంది, నిర్వాహకులతో వాగ్వాదం, గొడవకు దిగిన సంఘటన శుక్రవారం నగరంలో జరిగింది. బాధితులు, వన్‌టౌన్ పోలీసుల తెలిపిన మేరకు నగరానికి చెందిన ఇద్దరు యువకులు గుత్తి రోడ్డులో భారత్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి పెట్రోల్ వేయించుకున్నారు. రూ.100కు వేయమంటే బంకు సిబ్బంది తక్కువ పెట్రోల్ వేసినట్లు వారు అనుమానించారు. దీంతో బండి నుంచి పెట్రోల్ బయటకు తీశారు. బాటిల్‌లో సగం కూడా లేకపోవడంతో సిబ్బంది, బంకు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. భారీగా జనాలు అక్కడ గుమిగూడటంతో వాగ్వాదం పెద్దగా మారింది. పలువురు స్థానికులు, వాహన చోదకులు సైతం పెట్రోల్ సరిగ్గా వేయడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు బంకులోని పూలకుండీలను ధ్వంసం చేశారు. బంకులో పెట్రోల్‌తోపాటు, చిన్న బండ్లకు ఆయిల్ కూడా సక్రమంగా వేయడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. బంకును సీజ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని, విచారణ తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు శనివారం విచారణ చేయనున్నట్లు సమాచారం.


సిబ్బందితో గొడవ పడుతున్న యువకులు

మళ్లీ అదే..!

● తాడిపత్రిలోకి వెళ్లకుండా పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు


పెద్దారెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

తాడిపత్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి రాకుండా పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఓ వివాహానికి శుక్రవారం వెళ్తుండగా పట్టణ సీఐ ఆరోహణరావు సిబ్బందితో కలిసి అతన్ని అడ్డుకున్నారు. ఇల్లు విడిచి బయటకు తిరగరాదని సీఐ ఆరోహణరావు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సూచించారు. దీంతో ఆయన 'నేను ఏమైనా టెర్రరిస్టునా? ఇల్లు విడిచి వెళ్లకుండా ఉండటానికి' అని సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డుకోమంటే అడ్డుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. కనీసం మా బంధువులు, శ్రేయోభిలాషుల పెళ్లిళ్లు, పేరంటాలకు కూడా వెళ్లనీయకుండా ఉండటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోను పెళ్లికి వెళ్లాల్సిందేనని వాహనాన్ని ముందుకు కదిలించారు. పోలీసులు అడ్డుపడటంతో, వాహనం దిగి నడుచుకుంటూ కల్యాణ మండపం వైపు బయలుదేరారు. ఆ ప్రయత్నాన్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దారెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయాలు శాశ్వతం కాదని, ఎప్పుడూ ఒకేలాగ పరిస్థితులు ఉండవని హెచ్చరించారు. దాదాపు గంటపాటు వాగ్వాదం తర్వాత పెద్దారెడ్డి వెనుదిరిగి పోయారు.

డెమోగా నాగరాజు

అనంతపురం వైద్యం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ డెమోగా నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని పీఓడీటీటీ విభాగంలో నాగరాజు హెచ్‌ఈఈఓగా పనిచేస్తున్నారు. డిప్యూటీ డెమో త్యాగరాజు ఇప్పటివరకు ఇన్‌చార్జి డెమోగా కొనసాగుతూ వచ్చారు. నాగరాజు నియామకంతో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

పండుగపూట విషాదం

● ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు
● ఓ ఘటనలో తండ్రీకొడుకులు, మరో చోట వృద్ధుడి మృతి
● పలువురికి స్వల్ప గాయాలు

ఉరవకొండ/ధర్మవరం రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ పూట రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌కు చెందిన సుంకన్న(42), ఆయన కుమారుడు సుదర్శన్(9), కూతురు భవానితో కలిసి వజ్రకరూరు మండలం కడమలకుంట గ్రామంలోని సుంకులమ్మ ఆలయానికి గురువారం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పీసీ ప్యాపిలి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుంకన్న, సుదర్శన్ అక్కడికక్కడే మృతి చెందారు. స్వల్పంగా గాయపడిన భవానిని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ మహానంది ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ధర్మవరంరూరల్ మండలంలోని సీతారాంపల్లి క్రాస్ సమీపంలో గురువారం ఓ ఆటో బోల్తాపడి చంద్రాచెర్లకు చెందిన కత్తే బయన్న (77) మృతి చెందాడు. రాప్తాడు మండలం గొల్లపల్లిలో ఉన్న గొల్లపల్లయ్యస్వామి దర్శనానికి వెళ్లాడు. దర్శనం చేసుకుని తిరిగి సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరాడు. సీతారాంపల్లి క్రాస్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు రాయపాటి సతీష్, ఆటోలో ప్రయాణిస్తున్న నాగరత్నమ్మ కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బయన్న మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య వన్నక్కతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


సుంకన్న, సుదర్శన్ (ఫైల్)


కత్తే బయన్న (ఫైల్)

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

● మంత్రి సవిత చేతులమీదుగా వాయనాలు పంపిణీ


అలంకరణలో మహేశ్వరి అమ్మవారు

పెనుకొండ రూరల్, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి మహేశ్వరి శక్తి పీఠంలో మహేశ్వరి అమ్మవారి విగ్రహప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. మహారుద్రాభిషేకం, మహాపుష్పాలంకరణ, మహాచండీయాగం, పూర్ణాహుతి, ముత్తైదువులకు వాయినాలు సమర్పణ, చండీయాగం, గ్రామోత్సవం, కోనేటి తెప్పోత్సవం నిర్వహించినట్లు పీఠాధిపతి దేవేంద్రస్వామి తెలిపారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో 500మందికిపైగా మహిళలకు చీర, సారె పంపిణీ చేశారు. మంత్రి వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ, కేశవయ్య వాసుదేవరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు వాయినాలు ఇస్తున్న మంత్రి సవిత

హంద్రీనీవా పెండింగ్ పనులకు ఆమోదం

అనంతపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పనులు చేపట్టేందుకు రాష్ట్ర మంత్రి మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. ఉరవకొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా రాకెట్ల గ్రామ సమీపంలో ఆమిద్యాల లిఫ్ట్ పథకం ప్రారంభం, ఫేజ్ -2లో భాగంగా ప్యాకేజీ 52 - ఏలో పెండింగ్‌లో ఉన్న రూ.72.30 కోట్ల విలువైన 2 పనులకు ఆమోదం తెలిపింది. ఈ పనులను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని 10500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకుగాను వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలోని కొట్టాలపల్లి లిఫ్ట్ పథకం నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా వంద క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు రూ.55.60 కోట్లతో పనులు చేపట్టేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనుల ద్వారా 10500 ఎకరాలకు సాగునీటితోపాటు ఆ ప్రాంత వాసులకు తాగునీరు అందనుంది. అనంతపురం మిడ్ పెన్నార్ ప్రాజెక్టుకు రబ్బర్ సీల్స్ మార్చడం, కొత్త వాక్‌వే వంతెన నిర్మాణం, రేడియల్ క్రస్ట్ గేట్లకు ఇసుక బ్లాస్టింగ్, పెయింటింగ్, కంట్రోల్ ప్యానెల్ కొత్త బోర్డుల సరఫరా, సబ్ డిస్ట్రిబ్యూషన్ ప్యానెల్ బోర్డులు, కంట్రోల్ ప్యానెల్ బోర్డులు, ఆనకట్ల సుందరీకరణ పనులకు రూ.5.2 కోట్లకు ఆమోదం లభించింది.


గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దాం: జడ్పీ చైర్‌పర్సన్


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. గురువారం మహాత్ముడి జయంతి వేడుకలను జడ్పీలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్.. గాంధీజీ విగ్రహానికి పులమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ.. మహాత్ముడి ఆశయాలను సాధించే దిశగా ఉద్యోగులు క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీజీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంత కార్టూన్‌కు అంతర్జాతీయ బహుమతి


చిన్న కుళ్లాయప్ప


చిన్న కుళ్లాయప్ప గీసిన కార్టూన్

నార్పల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసి గీసిన కార్టూన్‌కు అంతర్జాతీయ స్థాయి లో అవార్డు దక్కింది. అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహించిన అలీ అల్టుమేక్ కారికేచర్ కాంపిటీషన్‌లో వివిధ దేశాల నుంచి పోటీపడ్డారు. నార్పలకు చెందిన ఆర్ట్ టీచర్ చిన్న కుళ్లాయప్ప గీసిన కార్టూన్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు గురువారం ప్రకటించారు. దీంతో కుళ్లాయప్ప హర్షం వ్యక్తం చేశారు. ఆయన కేశపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇదే పోటీలో పోర్చుగల్ వాసి ప్రథమ బహుమతి గెలుచుకోగా, ఇండోనేషియా కార్టూనిస్టు మూడో స్థానంలో నిలిచారు.

భక్తిశ్రద్ధలతో దసరా

● అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు


అనంతపురంలోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరిమాత నిజరూప దర్శనం

న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేడుకలను అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల ని యోజకవర్గాల్లో ప్రజలు గురువారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాల్లో సందడి నెలకొంది. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిది రోజులపాటు భక్తులకు రోజుకొక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు విజయదశమి సందర్భంగా ప్రత్యేక అలంకరణ లో పూజలందుకున్నారు. వేకువజామునే అర్చకులు అమ్మవార్ల మూలవిరాట్టులను, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాల స్వీకరించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయాలన్నీ సందడిగా కనిపించాయి. కళా కారులు సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలుప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ప్రజలు ఇళ్లను బంతిపూలు, మామిడితోరణాలతో అలంకరించి అమ్మవారికి పూజలు జరిపారు. తర్వాత కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో పండుగను ఆనందంగా జరుపుకున్నారు. సాయంత్రం జమ్మిచెట్టుకు పూజలు చేశారు. చిన్నారులు జమ్మి ఆకును పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు.

జిల్లా కేంద్రంలోని పాతూరు, కొత్తూరు అమ్మవారిశాలల్లో శుక్రవారం సాయంత్రం శయనోత్సవ సేవలతో న వరాత్రి వేడుకలను ముగించారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, పొలమ డ రమేష్‌బాబు, టంగుటూరు నాగభూషణ, కృష్ణం రఘు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చల్లా కృష్ణరంగయ్య, ప్రధాన కార్యదర్శి గర్జాల నాగరాజు, దూపకుంట సాయినాథ్ గుప్తా, తిరువీధుల జగదీష్, కొత్తూ రు, పాతూరు యువజన సంఘాలు, వాసవీ మహిళా మండలి ప్రతినిధులు, కార్యవర్గసభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


రాజీవ్ కాలనీ పంచాయతీ, రిక్షా కాలనీలో మహిషాసుర మర్దినిగా నసనకోట ముత్యాలమ్మ


రామచంద్రనగర్ షిర్డీసాయిబాబా ఆలయం వద్ద అమ్మవారి నగరోత్సవం


శివకోటి ఆలయంలో అమ్మవారికి ఊయల సేవ నిర్వహిస్తున్న దృశ్యం


అర్బన్ బ్యాంకు వద్ద నవదుర్గల అలంకరణలో విద్యార్థినులు

యల్లమ్మకు ప్రత్యేక పూజలు


యల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, కుటుంబసభ్యులు

రామగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల్లో భాగంగా దసరా ఉత్సవాలను గురువారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వెంకటాపురంలో ఎమ్మెల్యేపరిటాలసునీత, కుటుంబసభ్యులు కలిసి స్థానిక యల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని రాజరాజేశ్వరి అలంకరణ చేశారు. ఎమ్మెల్యే కుటుంబసభ్యులతో దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పరిటాలరవీంద్ర ఘాట్ వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రతి చెరువుకు నీరందించడమే ప్రభుత్వ ధ్యేయం

కనగానపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా నీటి ద్వారా అవకాశం ఉన్న ప్రతి చెరువును నింపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జనసేన రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దాదులూరు వద్ద ఉన్న హంద్రీనీవా కాలువను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ హంద్రీనీవా నీటితో రేగాటిపల్లి చెరువుతో పాటు పోతుకుంట చెరువును వీ లైనంత తొందరగా నింపుతామన్నారు. ఇంకా ధర్మవరం నియోజకవర్గంలో అవకాశం ఉన్న ప్రతి చెరువును నింపి రైతులకు సాగునీరందిస్తామని తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

రామగిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):మండలంలోని గరిమేకలపల్లి గ్రామంలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం ఇరువురు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామానికి చెందిన కురుబ శివన్న, కురుబ రమేశ్ పొలం వద్ద గొర్రెలు మేపుతున్నాడు. అయితే పొలంలోకి గొర్రెలు వెళ్లడంతో రమేశ్ శివన్నను మందలించాడు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఘర్షణకు దిగి దాడి చేసుకున్నారు. శివన్న తలకు గాయమైంది. దీనిని చూసిన శివన్న కుటుంబసభ్యులు రమేశ్ భార్య జయమ్మ ఇంటిలో ఉండగా ఆమెపై దూషణలకు దిగి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఫిర్యాదులు చేసుకోగా ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చలో విజయవాడ పోస్టర్ల విడుదల

అనంతపురంవిద్య, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డిమాండ్లసాధనకోసం ఈనెల7వతేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్రవ్యాప్త చలోవిజయవాడ పోరుబాటను విజయవంతం చేద్దామని మున్సిపల్ టీచర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఫ్యాప్టోనగరపాలకశాఖ ఆధ్వర్యంలో ఎస్కేడీస్కూల్లో సన్నాహక సమావేశంనిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, ఫణిభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన ఏడీసీసీబీ చైర్మన్


కలెక్టర్‌ను సన్మానిస్తున్న ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆనంద్‌ను, ఎస్పీ జగదీష్‌ను జిల్లాకేంద్రంలోని వారి కార్యాలయాల్లో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర నిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి శుక్రవారం మధ్యాహ్నంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో సత్కరించారు.

డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం


డీసీఎంఎస్ చైర్మన్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కనగానపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ పదవి చేపట్టాక నెట్టెం వెంకటేష్ గురువారం తొలిసారిగా కనగానపల్లి సొసైటీ కార్యాలయానికి వచ్చారు. ఆయన్ను రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్‌చౌదరి, టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య, ప్రధానకార్యదర్శి పతకమూరి ఆంజనేయులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. సర్పంచ్ అంకే రామక్రిష్ణ, ఎంపీటీసీ బిల్లే భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఊరేగింపు

రాప్తాడు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా సందర్భంగా మండలంలోని బండమీదపల్లి గ్రామంలో గురువారం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయమే అర్చకులు అలివేలు మంగ, పద్మావతి సమేత స్వామి వారి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు ఉత్సవమూర్తులను ట్రాక్టర్‌లో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. కట్టెల కోలన్న, చెక్క భజన, నృత్యాల నడుమ ఊరేగింపు ఘనంగా సాగింది.


కోలాటం, చెక్కభజన చేస్తున్న భక్తులు


పాతూరులో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి , ఎంపీ బీకే, వెంకటశివుడు యాదవ్


ఒకటో డివిజన్‌లో నివాళులర్పిస్తున్న ఉమర్‌ముక్తార్


కనగానపల్లిలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా మహాత్ముడి జయంతి

● వాడవాడలా ఘన నివాళి

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నగరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతూరులోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, హిందూపురం ఎంపీ పార్థసారధి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఇతర నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గాంధీజీ అహింసా మార్గంతోనే దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంతో 15 నెలలుగా రాష్ట్రంలో గాంధీ కలల రాజ్యం చూస్తున్నామని అన్నారు. ఎంపీ పార్థసారధి మాట్లాడతూ... గాంధీ కలల కన్న గ్రామస్వరాజ్యం దిశగా ఎన్‌డీఏ పాలన సాగుతోందని అన్నారు. వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ... గాంధీ స్ఫూర్తితో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: జేఎన్‌టీయూఏ పరిపాలన భవనంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, ఓఎస్‌డీ టూ వీసీ ఆచార్య దేవన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆచార్య మాధవి, ఓటీపీఆర్ఐ అనుబంధ కళాశాలలో డైరెక్టర్ ఆచార్య సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ గోపినాథ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు, ఏఆర్‌లు పాల్గొన్నారు.

●అనంతపురం క్లాక్‌టవర్: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ మహ్మద్ వసీం తన చాంబర్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, డిప్యూటీ కమిషనర్ పావని, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● అనంతపురం ప్రెస్‌క్లబ్: నగరంలోని 1వ డివిజన్‌లో గల గాంధీ విగ్రహానికి దూదేకుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఉమర్‌ముక్తార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు రాము, చంద్రమౌళి, జనార్దన్ రెడ్డి, ఆలీపీరా, మైనార్టీ నాయకులు , దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

●కనగానపల్లి: మండలకేంద్రంలోని సహకార సంఘం కార్యాలయ ఆవరణలో గాంధీజీ చిత్ర పటానికి డీసీఎంఎస్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, టీడీపీ కన్వీనర్ యాతం పోతలయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు.. రైతులకు లాభదాయకం

● జిల్లా వ్యవసాయాధికారి

అనంతపురంరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ పనిముట్లపై పన్ను తగ్గించడం రైతులకు లాభ దాయకమని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండలంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఏపీ ఆగ్రోస్ కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం వ్యవసాయ పనిముట్ల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా వ్యసాయాధికారి మాట్లాడుతూ.. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, వ్యవసాయ ఉత్పత్తులపై జీఎస్టీని 12 శాతం నుంచి ఐదుకి తగ్గించారన్నారు. డ్రిప్పు, స్ప్రింక్లర్లకు ఇది తక్షణమే వర్తిస్తుందన్నారు. అనంతరం ప్రదర్శనకు ఉంచిన పనిముట్లను పరిశీలించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా పుణ్యతిథి వేడుకలు


రామచంద్రనగర్ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

అనంతపురం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : షిర్డీ సాయినాథుడు సమాధి చెంది 107 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం నగరంలోని పలు సాయిమందిరాల్లో బాబా పుణ్యతిథి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామచంద్రనగర్‌లోని షిర్డీ సాయి మందిరంలో ఆలయ నిర్వాహకుడు మారుతీ ప్రసాద్ నేతృత్వంలో సాయినాథుని మూలవిరాట్‌కు పుష్పాంజలి నిర్వహించారు. తపోవనంలోని సద్గురు సాయినాథ్ మందిరంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. మూడో రోడ్డులోని మందిరంలోనూ బాబా పుణ్యతిథి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఖాదీ సంత

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి స్వదేశీ-ఇంటింటా స్వదేశీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న ఆప్కో భవనం ఎదుట బీజేపీ నాయకులు ఖాదీ సంత నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, ఆత్మనిర్భర్ భారత్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి చిరంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా బలమైన, ధృడమైన, ప్రపంచంతో పోటీ పడగలిగే ఆత్మనిర్భర్‌భారత్ కోసం ప్రధానమంత్రి మోదీ విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. దేశ ప్రజలు నిత్యజీవనంలో అధికంగా వాడే వస్తువుల్లో స్వదేశంలో తయారయ్యే వాటినే వాడాలని సూచించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, సీనియర్ నాయకులు లక్ష్మీదేవి, రత్నమయ్య, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



నగరవీధుల్లో రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు, రథంపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు

అనంతపురం టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డులోగల లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 22 నుంచి నిర్వహిస్తున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ నేపథ్యంలో అర్చకులు ఆలయంలోని భూదేవి, శ్రీదేవి, సమేత వేంకటేశ్వరుడి మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు చక్రస్నానం చేయించి, పీఠంపై ఆశీనులుగావించి, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ తిరుమంజనం, ఆలయ ప్రాకారోత్సవం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం పుట్టపర్తి వెంకటరమాణారెడ్డి, ఫ్లెక్సీ రమణ, కొండన్న, టీఆర్ వెంకటేష్‌గుప్తా, గోపాల్, నాగరాజు, ఎన్‌వీ రావు, ప్రధానార్చకుడు హరికిషోర్‌శర్మ పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల పట్ల హర్షం

అనంతపురంవిద్య, అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): భాషా పండితులకు స్కూల్‌అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయపండితపరిషత్ రాష్ట్రకార్యనిర్వాహకకార్యదర్శి ఎర్రిస్వామి, జిల్లా అధ్యక్షుడు తులసిరెడ్డి, ప్రధానకార్యదర్శి హనుమేష్, నాయకులు గురివిరెడ్డి, గోపాల్,రవికుమార్‌శనివారం ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దాదాపు ఆరేళ్లుగా ఎల్‌పీలకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. కూటమిసర్కారు సమస్యను పరిష్కరించి పదోన్నతులు ఇవ్వడం ఆనందదాయకమన్నారు, సీఎంకు, విద్యాశాఖామంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

ఆక్రమణల పరిశీలన

గార్లదిన్నె, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కల్లూరు గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను తహసీల్దార్ బండారు ఈరమ్మ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో కొందరు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తహసీల్దార్, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో ఆ స్థలాలను పరిశీలన చేశారు. స్థలాలు ఆక్రమించుకున్న వారు రికార్డులు చూపాలని తెలియజేశారు.

ఆటో ర్యాలీకి తరలిరండి

కనగానపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వాహన మిత్ర పథకం కింద ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ15 వేలు అందించనుందని, ఇందుకు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం అనంతపురం రూరల్ మండలంలో ఆటో ర్యాలీ జరగనుందని, ర్యాలీకి కనగానపల్లి మండలం నుంచి పెద్ద ఎత్తున ఆటో వాహనాలు, టీడీపీ శ్రేణులు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు.

ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించాలి

గార్లదిన్నె, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పథకం ద్వారా ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలని ఏపీఓ ఓబన్న పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని పెనకచెర్ల, డ్యాం, యర్రగుంట్ల గ్రామాల్లో శుక్రవారం తొలి రోజు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ... ఉపాధి పథకం ద్వారా సొంత గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించి ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఉపాధి కూలీల హాజరు శాతం పెంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే రోజుకు రూ. 307 కూలి పడే విధంగా చూడాలని సూచనలు ఇచ్చారు. టెక్నికల్ అసిస్టెంట్ రామాంజినేయులు, పంచాయతీ కార్యదర్శులు, కూలీలు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీపై అవగాహన

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనేక వస్తువలపై జీఎస్టీ తగ్గించిందని, దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తూనికలు కొలతలశాఖ ఏసీ సుధాకర్ సూచించారు. నగరంలోని డీమార్ట్ షాపింగ్ మాల్‌లో గురువారం ఆయన జీఎస్టీ 2.0పై వినియోగదారులకు అవగాహన కల్పించారు. జీఎస్టీ ఎంత మేరకు తగ్గింది, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపులపై వివరించారు. కేంద్రం చాలా వస్తువులపై జీఎస్టీ తగ్గించిందన్నారు. ఇది సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఊరట కలిగించే అంశమన్నారు. కేంద్రం ఇచ్చిన వెసలుబాటును ప్రతి పౌరుడు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

16 మంది అధికారులకు నోటీసులు

శింగనమల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఈనెల ఒకటో తేదీన పింఛన్ల పంపిణీని ఆలస్యంగా ప్రారంభించిన 16 మంది అధికారులకు ఎంపీడీఓ భాస్కర్ నోటీసులు జారీ చేశారు. ఉదయం 7గంటలు అయినా మండలంలో 16 మంది సచివాలయ ఇతర అధికారులు యాప్‌లో పింఛన్ పంపిణీకి లాగిన్ కాకపోవడంతో ఎంపీడీఓ గురువారం నోటీసులు జారీ చేశారు. నోటీసులు తీసుకున్న అధికారులు వెంటనే సజాయిషీ ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న దంపతులను ద్విచక్రవాహనం ఢీకొనడంతో భార్య మృతి చెందగా.. భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు రాజీవ్‌కాలనీకి చెందిన షేక్ ఖాజావలి(60), షేక్‌బీబీ(58) దంపతులు గురువారం సాయంత్రం 4:30 గంటలకు క్లాక్ టవర్ వైపు నుంచి ఆటోలో వచ్చి నడిమివంకలో దిగారు. తమ కూతురు 6వ రోడ్డులో ఉండగా, ఆమె ఇంటికి వెళ్దామని గంగమ్మ గుడి నుంచి మోర్ షాపింగ్‌మాల్ వైపునకు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో షేక్ బీబీ మరణించగా, షేక్ ఖాజావలి కి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్రవాహనదారు వైఎస్ఆర్ కాలనీకి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు

అనంతపురం టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్యార్మీ వేడుకలను పురస్కరించుకుని షాహే గౌసే ఆజం ఆసార్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు శ్రీనివాసనగర్‌లోని దస్తగిరి పాంవబి దర్గా వద్ద శుక్రవారం సాయంత్రం గంధం ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురవీధుల్లో గంధంను ఊరేగించిన అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో భాగంగా శనివారం సాయంత్రం దర్గాలో దస్తగిరి స్వామి పవిత్ర కేశదర్శనం ఉంటుందని, అలాగే భక్తులకు అన్నదానం చేయనున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా శోభాయాత్ర


శోభాయాత్రలో అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్, పాలకవర్గసభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గత పదిరోజులుగా అర్బన్ బ్యాంకు వద్ద చైర్మన్ జేఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో పాలకవర్గం నిర్వహించిన దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలు ముగిశాయి. గురువారం విజయదశమి సందర్భంగా దుర్గాదేవి అమ్మవారికి విశేష అలంకరణలు, పూజలు నిర్వహించారు. అలాగే శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అట్టహాసంగా శోభాయాత్ర చేశారు. అమ్మవారి నామస్మరణతో నగరంలోని ప్రధాన వీధులు మారుమ్రోగాయి. శోభాయాత్రలో కోలాటం, గురవయ్యల నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు నవదుర్గల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఊరేగింపులో భారీగా జనం పాల్గొన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు వైస్ చైర్మన్లు చంద్రశేఖర్, వడ్డే మణి, డైరెక్టర్లు , సీతఊట విజయభాస్కర్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్‌మురళి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పీఏబీఆర్ నుంచి నగరంలో నీటి సరఫరా చేసే పైపులైన్ రాచానపల్లి వద్ద లీకేజీ కారణంగా శుక్రవారం నీటి సరఫరా నిలిచిపోయింది. నగరపాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్, డీఈ నరసింహులు లీకేజీ స్థలానికి వెళ్లి పరిశీలించారు. సుమారు 8గంటల పాటు శ్రమించి లీకేజీని గుర్తించి, మరమ్మతులు చేశారు. శనివారం యధావిధిగా నగరంలో నీటి సరఫరా చేస్తారని కమిషనర్ రంగస్వామి తెలిపారు.

కొనసాగిన వైద్యుల నిరసన

అనంతపురం వైద్యం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతులు, పీజీ కోటా తదితర డిమాండ్ల సాధనకు పీహెచ్‌సీ వైద్యులు నిరసన మూడోరోజు శుక్రవారం కూడా కొనసాగించారు. సీనియర్ వైద్యులు నారాయణస్వామి, శ్రీనివాసబాబు, విష్ణుమూర్తి మాట్లాడారు. ప్రతి డాక్టర్‌కు అదేస్థానంలో ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం నేతలుపాల్గొన్నారు.

9న దిశా సమావేశం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం ఈ నెల 9న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవనంలో సమావేశం ఉంటుందన్నారు. సమావేశ అజెండాను ప్రకటించారు. సభ్యులు తప్పనిసరిగా హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

18న కలెక్టరేట్‌లోని వాహనాల వేలం

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నిరుపయోగంగా ఉన్న వాహనాలను ఈ నెల 18న వేలం వేస్తామని డీఆర్వో మలోల శుక్రవారం తెలిపారు. వేలంలో వాహనాలను దక్కించుకున్న వారు ధరతోపాటు 18 శాతం జీఎస్టీ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు చిరునామా ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని, రూ.10వేలు డీడీ రూపంలో జిల్లా రెవెన్యూ అధికారి, అనంతపురం పేరుతో చెల్లించాలని సూచించారు. వేలంలో వాహహనాలు పొందని వారికి ఆ సొమ్ము తిరిగి చెల్లిస్తామన్నారు.

పెయింటర్ ఆత్మహత్య

గార్లదిన్నె, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కల్లూరుకు చెందిన బోయ రాము (37) పెయింటర్‌గా జీవనం సాగించేవాడు. కాగా అతడితో భార్య కౌసల్య గత రెండేళ్ల క్రితం గొడవపడి పుట్టింటికి వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. దీంతో భార్య కాపురానికి రాలేదని జీవితంపై విరక్తి చెందిన రాము శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దించి చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


గుత్తిరూరల్ : సేవాఘడ్‌లో రాజరాజేశ్వరిగా మాతాజగదాంబ


యాడికి: పెద్దమ్మతల్లికి శయనోత్సవం


బొమ్మనహాళ్ : ఉంతకల్లులో రేణుకాయల్లమ్మదేవి


గుంతకల్లు: కనకదుర్గమ్మ విగ్రహం ఊరేగింపు

దసరా సందడి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: దసరా పండుగను గురువారం తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఊరూవాడా అంతటా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుత్తి మండలంలోని సేవాఘడ్‌లో మాతాజగదాంబ, ఉరవకొండలో చౌడేశ్వరిదేవి రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చారు. గుంతకల్లులో దుర్గామాత విగ్రహాన్ని ఊరేగించారు. యాడికిలో పెద్దమ్మతల్లికి శయనోత్సవ సేవ నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలంలో ఉంతకల్లులో రేణుకాయల్లమ్మదేవి, గుత్తి మండలం తొండపాడులో బొలికొండ రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుత్తిలో రేణుకాల ఎల్లమ్మ దేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. బెళుగుప్ప మండలం ఎర్రగుడిలో భక్తులు బీరప్ప ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి శమీవృక్షానికి పూజలు చేశారు. యాడికిలో చెన్నకేశవస్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారిని శమీవృక్ష దర్శనం చేయించారు. యాడికిలోని కోనరోడ్డులో ఉన్న చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కూడేరులో జోడులింగాల సంగమేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని జమ్మిచెట్టు వరకూ తీసుకుళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దవప్పూరులోని చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లిలో శ్రీరాజరాజేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఊరేగించారు. రాయదుర్గంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం దుర్గామాత విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.


పెద్దపప్పూరు : జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు


రాయదుర్గంరూరల్: బొమ్మక్కపల్లిలో అమ్మవారి రథోత్సవం


గుత్తి: ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు

న్యూస్ బాక్స్

మండల మీట్‌లో బిల్లులపై రభస


వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్‌ల వాగ్వాదం

పామిడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల బిల్లులకు నిధుల మంజూరు విషయంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచులు డీసీ ముత్యాలురెడ్డి, మూలి నాగేశ్వరరెడ్డి, వెంకటేష్ నాయక్ మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సమావేశాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీ పనుల బిల్లులు నిలిపివేశారంటూ సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు మూలి నాగేశ్వరరెడ్డి, డీసీ ముత్యాలరెడ్డి అధికారులను నిలదీశారు. పాత బిల్లుల నిధులు వచ్చేంతవరకూ కొత్త పనులు చేపట్టరాదని అన్నారు. ఎంపీపీ మురళీమోహన్‌రెడ్డి సైతం సర్పంచులకు వంతుపాడారు. దీంతో వైస్ ఎంపీపీ కాయల మహేష్ జోక్యం చేసుకొని.. గత ప్రభుత్వంలోనూ తాను వైసీపీ ఎంపీటీసీగా ఉన్నప్పటికీ తన బిల్లులు నిలిపివేశారని, సమస్యలపైనే మాట్లాడాలే తప్పా.. పార్టీలను తీసుకురావద్దని వారి వాదనకు దిగారు. డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమ నాయుడు మాట్లాడుతూ.. అత్యవసర పనుల నిమిత్తం పంచాయతీలోని నిధులను ఖర్చు చేయలేదని స్పష్టం చేయడంతో వాగ్వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, తహసీల్దార్ షర్మిల, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే రన్నింగ్ స్టాఫ్ నిరసన

గుత్తి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని క్రూలాబీలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ ఆధ్వర్యంలో రైల్వే రన్నింగ్ స్టాఫ్ గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి విధుల్లో నిరసన వ్యక్తం చేశారు. ఆ యూనియన్ కార్యదర్శి శేఖర్ బాబు మాట్లాడుతూ.. రైల్వే బోర్డు ఉత్తర్వులకు వ్యతిరేకంగా నియమాలు ప్రవేశపెడుతూ తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

6న కలెక్టరేట్ వద్ద ధర్నా

పామిడి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని సోమవారం దివ్యాంగుల సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, దాన్ని విజయవంతం చేయాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ హరినాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య కమ్యూనిటీ భవనంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు సర్వేష్, పామిడి మండల అధ్యక్షుడు కేశవాచారి, ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి శివన్న, నాగభూషణ, నరసింహులు, రహంతుల్లా, వడ్డే లక్ష్మయ్య, మల్లికార్జున, కేశవ, ఓబుళపతి, సుధాకర్, హనుమాన్, బాబు పాల్గొన్నారు

ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 2,710 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2,670 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.897 టీఎంసీల నీరు ఉందని, ఫేజ్-2కు 1,897 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

వైసీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా రమేష్



యాడికి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా యాడికికి చెందిన బొంబాయి రమేష్‌నాయుడు నియమితుడయ్యారు. వైసీపీ ఆవిర్భావం నుంచి మండల కన్వీనర్‌గా ఉన్న ఆయన పార్టీ బలోపేతానికి కృషిచేశారు. ఆయన సతీమణి ఉమాదేవి యాడికి ఎంపీపీగా పనిచేస్తున్నారు.

సీఐగా ఆరోహణరావు బాధ్యతల స్వీకరణ



తాడిపత్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ఆరోహణరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిత్తూరు క్రైం బ్రాంచ్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడి సీఐ సాయి ప్రసాద్ వీఆర్‌కు వెళ్లారు.

ఉత్తమ సర్పంచ్‌కు సన్మానం


సర్పంచ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఉరవకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్న వ్యాసాపురం సర్పంచ్ సీతారాములను ఎస్కేఆర్సీ క్లబ్ సభ్యులు గాంధీ జయంతి సందర్భంగా గురువారం సన్మానించారు. కార్యక్రమంలో ఆ క్లబ్ సభ్యులు రవీంద్ర, ఎర్రిస్వామి నాయుడు పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామసభలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: భూ వివాదాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని చేపట్టింది. మూడో విడతలో భాగంగా పలు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు గ్రామంలో తహసీల్దార్ మునివేలు, మండల సర్వేయర్ రవితేజ, బెళుగుప్ప మండలంలోని ఎర్రగుడిలో డిప్యూటీ తహసీల్దారు మధుసూదన్‌రావు, కుందుర్పి మండలం అపిలేపల్లిలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంత్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి, బ్రహ్మసముద్రం మండలం భైరసముద్రంలో తహసీల్దార్ సుమతి ఆధ్వర్యంలో ఈ అవగాహన సదస్సులు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పుట్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో ఈనెల 1న నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రత్యూష, భార్గవి, అంజలి, బిందు, వైష్ణవ్‌కుమార్‌రెడ్డి, మణికంఠ, భరత్‌కుమార్, విజయ్‌కుమార్ ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని ఆ పాఠశాల సిబ్బంది శుక్రవారం అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

వైసీపీ బాధితులకు న్యాయం చేస్తా

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో పట్టణంలో పలుచోట్ల స్థలాలను కబ్జా చేశారని, ఆ స్థలాలను విడిపించి తిరిగి ప్రజలకు అప్పగించి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు స్పష్టం చేశారు. గాంధీజయంతి సందర్భంగా స్థానిక గాంధీ సర్కిల్‌లో మహాత్ముడి విగ్రహం వద్ద, ప్రజావేదికలో గాంధీ చిత్రపటం వద్ద గురువారం నివాళులర్పించిన ఆయన మాట్లాడారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ పనులు, డివైడర్లు ఏర్పాటు చేసి, కళ్యాణదుర్గం పట్టణాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో బీటీపీ కాలువ పనులను సకాలంలో పూర్తి చేసి రైతుల కలను నెరవేర్చడమే తన లక్ష్యమన్నారు.

దళారుల నిలువు దోపిడీకి చెక్

- వేలంపాట ద్వారా ఒక దళారీ ఎంపిక
- పంటలన్నీ అతడికే విక్రయించేలా ఒప్పందం
- వేలం ద్వారా వచ్చిన రూ.6.85 లక్షలు ఆలయ అభివృద్ధికి..


వేలంపాట నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

విడపనకల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటను గ్రామంలోని కొంతమంది దళారులు ఇష్టమొచ్చిన ధరలతో మోసం చేస్తూ దోపిడీకి పాల్పడేవారు. దీంతో ఈ దళారుల దోపిడీని అడ్డుకునేందుకు మండలంలోని పాల్తూరు గ్రామస్థులు ఏకమయ్యారు. గ్రామంలోని రైతులంతా ఒకే దళారీకి పంటలు మొత్తం సంవత్సరం పాటు అమ్మాలన్ని.. ఆ దళారీ ఎంపికకు గురువారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఇందులో అనేక మంది దళారులు పోటీపడ్డారు. అదే గ్రామానికి చెందిన దాసరి శీన రూ.6.85 లక్షలకు ఆ వేలం దక్కించుకున్నారు. ఇకపై గ్రామంలో ఏ రైతు పండించిన పంట అయినా సరే ఆయన ఆధ్వర్యంలో విక్రయించాలని.. ఏ ప్రాంతం నుంచి వ్యాపారులు వచ్చినా ఆయన ద్వారానే పంటలను కొనాలని తీర్మానించారు. వేలం ద్వారా వచ్చిన ఆ మొత్తాన్ని గ్రామంలోని ఆలయ అభివృద్ధికి ఉపయోగిస్తామని ఆ గ్రామ పెద్దలు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రూ.8.5 లక్షల నగదు, బంగారు నగల అపహరణ


కిటికీ ఊచలను కట్ చేసిన దొంగలు

కళ్యాణదుర్గం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పార్వతి నగర్ వాసి మహేంద్ర ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మహేంద్ర పట్టణంలో ద్విచక్రవాహనాల స్పేర్ పార్ట్స్ అమ్ముకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. మహేంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసుకుని ఊరికి వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు ఇంటి కిటికీకి ఉన్న ఇనుపరాడ్లను కట్ చేసి, ఇంటిలోకి ప్రవేశించినట్లు గుర్తించారు. ఇంట్లోని సుమారు రూ.8.50 లక్షల నగదు, బంగారు ఆభరణాలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. టౌన్ సీఐ హరినాథ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇటీవల కాలంలో పార్వతీనగర్‌లో దొంగలు రెచ్చిపోయి తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారని, పోలీసులు వాటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

విప్ కాలవకు శుభాకాంక్షల వెల్లువ


విప్ కాలవకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు దసరా పండుగ, పుట్టిన రోజు సందర్భంగా గురువారం పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మం డలంలోని వివిధ గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా కా లవ శ్రీనివాసులు నివాసానికి తరలివెళ్లారు. కేక్ కట్ చేసి శు భాకాంక్షలు తెలిపారు. ఇందులో సింగల్ విండో ఛైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, క్లస్టర్ కన్వీనర్ ధనుంజయ, స్టోర్ డీలర్ సంఘం అధ్యక్షులు పయ్యావుల మోహన్, టీడీపీ నాయకులు సోమనాథ్ గౌడ్, నవీన్, గోరంట్ల వెంకటేశులు, రవిచంద్రసాగర్ ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న అధికారులు

ఉరవకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు పొందే లబ్ధిని వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శంకర్, డిప్యూటీ ఎంపీడీఓ సతీష్, కార్యదర్శి గౌస్ సాహెబ్, వార్డు సభ్యుడు వాసు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

పెద్దవడుగూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సుమారు 500 సంవత్సరాల క్రితం నిర్మించిన శివాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సహకారంతో ఎండోమెంట్ వారు ఆ ఆలయ పునర్నిర్మాణానికి దాదాపు రూ.కోటి మంజూరు చేశారు. ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం వేదపండితులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పెద్దఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న గ్రామపెద్దలు

భారీ ఇసుక డంప్ స్వాధీనం

బొమ్మనహాళ్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువళ్లి గ్రామ శివారు.. కర్ణాటక సరిహద్దులో భారీగా ఇసుకగా డంప్ ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ నబీరసూల్, తహసీల్దార్ మునివేలు శుక్రవారం ఆ ప్రాంతాన్ని తనిఖీ చేశారు. కర్ణాటక ప్రాంతానికి అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఆ ఇసుక మొత్తాన్ని స్టేషన్‌కు తరలించారు. అక్రమ రవాణా వెనక ఉన్న అసలు ముఠాను బట్టబయలు చేసి, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం అని ఎస్ఐ అన్నారు.


ఇసుక డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

గొంతు కోసుకుని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించిన సీఐ


శేఖర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

ఉరవకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక హమాలీ కాలనీకి చెందిన శేఖర్ గొంతుకోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. మానసిక పరిస్థితి సరిగా లేని ఇతను కుటుంబ సమస్యలతో విసిగిపోయాడు. మండలంలోని బూదగవి సమీపంలోని పొలంలో గురువారం ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ మహానంది తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో శేఖర్ ఆసుపత్రి నుంచి బయటకు పరుగులు తీశాడు. పోలీసులు స్థానికుల సాయంతో అతికష్టం మీద అతన్ని మళ్లీ ఆసుపత్రి తీసుకువచ్చి వైద్యం చేయించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్వీవంక గ్రామానికి చెందిన కూలీ ఆనంద్‌నాయక్ శుక్రవారం బైక్‌పై రాయదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణ సమీపంలోని శనిమహాత్ముని గుడి సమీపంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పి...

గుత్తిరూరల్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వాసి రాముడు బైక్‌పై గుత్తికి శుక్రవారం వస్తుండగా కొత్తపేట గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎల్లుట్లలో ఘర్షణ

పుట్లూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో స్థలం విషయంలో శుక్రవారం ఘర్షణ జరిగింది. ఇంటి వెనుక కలం దొడ్డి స్థలం విషయంలో నాగేశ్వరయ్య, అచ్చమ్మపై అదే గ్రామానికి చెందిన నాగరాజు, రంగస్వామి కట్టెలతో దాడిచేశారు. గాయపడిన వారిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.